## అట్టహాసంగా ఐపీఎల్ ప్రారంభ వేడుకలు

హైదరాబాద్: అమృత్ తెలంగాణ: ఐపీఎల్ ప్రారంభ వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈడెన్ గార్డెన్ స్టేడియంను విద్యుత్ లైట్లతో, లేజర్ కాంతులతో అలకరించారు. వేడుకలను చూడడానికి పెద్ద సంఖ్యలో క్రికెట్ ఫ్యాన్స్ స్టేడియానికి తరలివచ్చారు. క్రేజీ పాటలతో క్రీడాభిమానులను సింగర్స్ ఉర్రూతులూగించారు. కోల్‌కతాలోని ప్రఖ్యాత ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఆర్‌సీబీ, కేకేఆర్ తలపడనున్నాయి. దేశంలోని 13 నగరాల్లో నిర్వహించబోయే ఈ మెగా ఈవెంట్‌లో 74 మ్యాచ్ (70 లీగ్, 4 నాకౌట్)లు జరగనున్నాయి. టోర్నీలో పాల్గొనబోయే పది జట్లను రెండు గ్రూపులు విభజించారు. గ్రూప్–ఏలో చెన్నై, కోల్‌కతా, రాజస్థాన్, బెంగళూరు, పంజాబ్ ఉండగా గ్రూప్–బీలో ముంబై, హైదరాబాద్, గుజరాత్, ఢిల్లీ, లక్నో ఉన్నాయి. లీగ్ దశలో టాప్–4లో నిలిచిన నాలుగు జట్లు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. మార్చి 22 నుంచి మే 18 వరకూ లీగ్ మ్యాచ్‌లు జరుగనుండగా, మే 20 నుంచి నాకౌట్ దశ మొదలవుతుంది.


# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక


## బ్యాంక్ ఉద్యోగుల సమ్మె వాయిదా

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ:బ్యాంకింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ఇచ్చిన సమ్మె పిలుపు తాత్కాలికంగా వాయిదా పడింది. శుక్రవారం సెంట్రల్ లేబర్ కమిషనర్‌తో జరిగిన సమావేశం అనంతరం మార్చి 24, 25 తేదీలలో రెండు రోజుల దేశవ్యాప్త బ్యాంకుల సమ్మెను విరమించుకున్నట్టు యూఎఫ్‌బీయూ ప్రకటించింది. ప్రధానంగా ఐదు రోజుల పని దినాలు, కొత్త నియామకాలు, పనితీరు ఆధారంగా ప్రోత్సాహక ఆందోళన అంశాలపై లేబర్ కమిషనర్, ఫైనాన్సియల్ సర్వీసెస్ శాఖ (డీఎఫ్ఎస్) అధికారులతో చర్చించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. అధికారులు తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించారని పేర్కొన్నాయి. "ఐదు రోజుల పని విధానంపై తాను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తానని సెంట్రల్ లేబర్ కమిషనర్ హామీ ఇచ్చారు. నూతన నియామకాలు, ఇతర ఆందోళనలపై తదుపరి చర్చలు జరుపుతామని ఇండియన్ బ్యాంకర్స్ అసోసియేషన్ (ఐబీఏ) అంగీకరించింది.


సంపుటి: 01 సంచిక : 172. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ ఆదివారం.23.03.2025 పేజీలు:4, వెల:రూ.1.00


# బీజేపీది జనాభా జరిమానా విధానం

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: నియోజకవర్గాల పునర్విభజనలో బీజేపీది జనాభా జరిమానా విధానమని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మనందరిది ఒకే దేశమనీ, దాన్ని గౌరవిద్దామనీ, అయితే పునర్విభజనను అంగీకరించొద్దని సూచించారు. నియోజకవర్గాల పునర్విభజనపై శనివారం చెన్నైలో జరిగిన సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడారు. సీట్లు పెంచకుండా ఉన్న సీట్లలోనే పునర్విభజన చేయాలని కోరారు. జనాభా దామాషా ప్రాతిపదికన పునర్విభజనకు తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు. ప్రోరేటా ప్రక్రియ రాజకీయ అంతరాలను పెంచుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాలన్నింటిపై దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. నియోజకవర్గాల పునర్విభజనపై అందరినీ ఏకధాటిపైకి తెచ్చిన తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. 1971లో జనాభాను నియంత్రించాలని దేశం నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి దక్షిణాది రాష్ట్రాలు దాన్ని అమలు చేస్తే ఉత్తరాదిలోని పెద్ద రాష్ట్రాలు జనాభా నియంత్రణలో విఫలమయ్యాయని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలన్నీ వేగంగా ఆర్థికవృద్ధిని సాధించాయి.. జీడీపీ, తలసరి ఆదాయం, వేగంగా ఉద్యోగాల కల్పన, మెరుగైన మౌలిక వసతుల కల్పన, సుపరిపాలన, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో మంచి ప్రగతి సాధించాయని చెప్పారు. దేశ ఖజానాకు మనం పెద్ద మొత్తంలో నిధులు ఇస్తూ తక్కువ మొత్తాన్ని పొందుతున్నామన్నారు. తమిళనాడు పన్నుల రూపంలో కేంద్రానికి రూపాయి చెల్లిస్తే 29 పైసలే వెనక్కి వస్తుంటే ఉత్తరప్రదేశ్‌కు రూపాయికి రూ. 2.73, బీహార్ కు రూ. 9.22, మధ్యప్రదేశ్‌కు రూ. 2.79 వెనక్కి వెళుతున్నాయని తెలిపారు. అదే దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటకకు 14 పైసలు, తెలంగాణకు 41 పైసలు, కేరళకు 62 పైసలు వెనక్కి వస్తున్నాయని వివరించారు. దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం కేటాయింపులు, పన్ను చెల్లింపులు క్రమంగా తగ్గిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ కేటాయింపుల్లోనూ ఉత్తరాది రాష్ట్రాలకే 60 నుంచి 65 శాతం నిధులు దక్కుతున్నాయని విమర్శించారు.

దక్షిణాది రాష్ట్రాల రాజకీయ కుదింపునకు దారితీసే పునర్విభజనను అంగీకరించబోమని సీఎం తేల్చిచెప్పారు. ప్రగతిని సాధిస్తున్న రాష్ట్రాలను ఈ ప్రక్రియ శిక్షిస్తోందనీ, ఇలాంటి అసమగ్రమైన పునర్విభజన ప్రక్రియ చేపట్టకుండా బీజేపీని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. 1976లో రాజకీయ తేడాలు రాకుండా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పునర్విభజన చేపట్టిందని గుర్తుచేశారు. 2001లో ప్రధానమంత్రి వాజ్‌పేయీ నేతృత్వంలోని ప్రభుత్వం పునర్విభజన ప్రక్రియను అలానే ప్రారంభించిందని తెలిపారు. బీజేపీ ప్రతిపాదిస్తున్న జనాభా దామాషా పద్ధతిలో పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాలు రాజకీయ గళం కోల్పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది వారిని ఉత్తరాది ద్వితీయ శ్రేణి పౌరులుగా తగ్గించి వేస్తుందని చెప్పారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేపడితే ఉత్తరప్రదేశ్,



బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు దేశంపై ఆధిపత్యం చెలాయిస్తాయన్నారు. బీజేపీ అనుసరిస్తున్న ఈ విధానానికి వ్యతిరేకంగా దక్షిణాది ప్రజలు, పార్టీలు, నాయకులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ప్రోరేటా విధానాన్ని పాటిస్తే సీట్ల మధ్య తేడా కేంద్ర ప్రభుత్వ ఏర్పాటును నిర్ణయిస్తుంది.. ఒక్క సీటు కూడా తేడాను చూపుతుందన్నారు. ఒక్క సీటుతో కేంద్ర ప్రభుత్వం పడిపోయిన చరిత్ర మన దేశంలో ఉందని గుర్తుచేశారు. కాబట్టి ప్రోరేటా విధానం కూడా దక్షిణాది రాజకీయ ప్రయోజనాలకు భంగం కలిగిస్తుందన్నారు.

"పార్లమెంట్ దేశానికి విధానపరమైన శాసనాలను రూపొందిస్తుందే తప్ప ప్రజలకు అవసరమైన చిన్న చిన్న సమస్యలపై నిర్ణయాలు చేయదు. ప్రజలకు సంబంధించిన ముఖ్యమైన సమస్యలు స్థానిక సంస్థలు, రాష్ట్రాలు, శాసనసభ నియోజకవర్గాల పరిధిలోనే పరిష్కారమవుతాయి. జనాభా నియంత్రణకు సంబంధించి దక్షిణాది రాష్ట్రాలను శిక్షించే విధానానికి కేంద్రం స్వస్తి చెప్పాలి. దేశ నిర్మాణంలో 1975 నుంచి 2025 వరకు 50 ఏండ్ల పాటు మనం అందించిన సేవలకు మనల్ని అభినందించాలి. మంచి ప్రగతి సాధించిన దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంట్ సీట్లలో మంచి వాటా ఇవ్వడం ద్వారా ఇతర రాష్ట్రాల ఆర్థిక వద్ధి, సుపరిపాలనపై దష్టి సారించేలా చేయాలి. " అని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

శాసనసభలో తీర్మానం

పునర్విభజన ప్రక్రియపై తెలంగాణ రాష్ట్ర శాసనసభలో త్వరలోనే తీర్మానం ఆమోదిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేస్తున్నట్టే దక్షిణాది రాష్ట్రాల అసెంబ్లీల్లో తీర్మానాలు చేయాలని సహచర ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేశారు. దక్షిణ భారతదేశ పౌరుల గళాన్ని బలంగా, ఐక్యంగా మొత్తం భారతదేశానికి వినిపిద్దామని సూచించారు.

# ఐపీఎల్ మ్యాచ్‌లకు పటిష్ట భద్రత




అమృత్ తెలంగాణ: హైదరాబాద్ ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగే టాటా ఐపీఎల్–18షెడ్యూల్‌లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఉప్పల్ స్టేడియం వేదికగా 9 మ్యాచ్‌లు (ఈ నెల 23 నుంచి వచ్చే నెల 21 వరకు) జరగనున్నాయి. ఈ నేపథ్యంలో భద్రతాపరంగా అనేక చర్యలు చేపట్టినట్టు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో విలేకరుల సమావేశంలో డీసీపీ పద్మజ, హెచ్‌సీఏ అధ్యక్షులు జగన్మోహన్‌రావుతో కలిసి సీపీ వివరాలు వెల్లడించారు. ఆదివారం ఉదయం మ్యాచ్ మొదలవుతుందని, మిగిలిన మ్యాచ్‌లు రాత్రి సమయంలో జరుగుతాయని చెప్పారు. మ్యాచ్ ప్రారంభానికి మూడు గంటల ముందు నుంచే ప్రేక్షకులను స్టేడియంలోకి అనుమతిస్తామని తెలిపారు. 2,700 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం 300 మంది పోలీసులతోపాటు, లా అండ్ ఆర్డర్‌లో 1,218 మంది పోలీసులు బందోబస్తులో ఉంటారన్నారు. ఐపీఎల్ బందోబస్తు కోసం 12 బెటాలియన్లు, 2 అక్టోపస్ బృందాలు, 10 మౌంటెడ్ పోలీస్ బృందాలు, 450 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. స్టేడియంలోనే ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, కంట్రోల్ రూమ్‌ను ఏసీపీ స్థాయి అధికారి పర్యవేక్షించనున్నట్టు వివరించారు. స్టేడియం ఎంట్రెన్స్ వద్ద స్నిఫర్ డాగ్స్‌తో పాటు బాంబ్ స్క్వాడ్స్ తనిఖీలు చేస్తాయన్నారు. మహిళల భద్రత కోసం మఫ్టీలో షీ టీమ్స్ పని చేస్తాయని తెలిపారు. ఐదు చోట్ల స్టేడియం పరిసరాల్లో పార్కింగ్ సౌకర్యం కల్పించామన్నారు. మెడికల్ టీమ్స్‌తోపాటు అంబులెన్స్, అగ్నిమాపక సిబ్బందిని అందుబాటులో ఉంచామని తెలిపారు. పాసులు కలిగిన వారు పోలీసుల సూచనల మేరకు పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలను పార్క్ చేయాలన్నారు. పార్కింగ్ రుసుం వసూళ్లు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఐపీఎల్ టికెట్లు ఆన్‌లైన్‌లోనే విక్రయించారని, ఎవరూ బయట వ్యక్తుల నుంచి కొనుగోలు చేయొద్దని సూచించారు. బ్లాక్‌లో టికెట్ విక్రయించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. టికెట్లు కలర్ జిరాక్స్ తీసుకొస్తే చర్యలు తప్పవన్నారు.

కార్లు, వాహనాలపై వచ్చే వారికి ఫ్రీ పార్కింగ్ అందుబాటులో ఉంటుందన్నారు. ఎవరైనా బ్లాక్‌లో టికెట్లు, పార్కింగ్ ఫీజ్ వసూలు చేసినట్టు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా రాచకొండ వాట్సాప్‌లో సమాచారం ఇవ్వాలని సీపీ చెప్పారు. ఈ సమావేశంలో డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు. మొబైల్ ఫోన్లు, బ్లూటూత్‌కు మినహా ఎలక్ట్రానిక్ వస్తువులను స్టేడియం లోపలకు అనుమతించబోమని సీపీ చెప్పారు. మహిళలకు పెద్ద సైజు గల పర్సులకు అనుమతి లేదన్నారు.

# పలు పద్దులకు శాసనసభ ఆమోదం

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రాష్ట్ర బడ్జెట్‌కు సంబంధించి పలు పద్దులను శనివారం శాసనసభ ఆమోదించింది. వైద్యారోగ్యశాఖ, రవాణా, కార్మికశాఖ, వ్యవసాయం, సహకారశాఖ తదితర శాఖల పద్దులపై సభలో జరిగిన చర్చకు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సమాధానమిచ్చారు. అనంతరం పద్దులను ఆమోదించడంతో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సభను సోమవారానికి వాయిదా వేశారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ, వైద్యారోగ్యశాఖలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్టు తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ లో చికిత్సల ధరలను 22 శాతం పెంచడంతో పాటు 163 రకాల చికిత్సలను దాని పరిధిలోకి తెచ్చినట్టు తెలిపారు. అదనంగా రూ. 487.29 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. నెట్ వర్క్ ఆస్పత్రులను పెంచినట్టు వెల్లడించారు. ఇప్పటికే 8 వేల పైగా ఖాళీలను భర్తీ చేయగా, మరో 6 వేల ఖాళీల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నదని చెప్పారు. గతంలో కన్నా నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలు కఠినతరంగా మారినా 8 మెడికల్ కాలేజీలకు అనుమతి తెచ్చుకున్నట్టు తెలిపారు. కొత్తగా 16 నర్సింగ్ కాలేజీలు, 28 పారామెడికల్ కాలేజీలు ప్రారంభించినట్టు తెలిపారు. 27 ఎకరాల విస్తీర్ణంలో రూ. 2,700 కోట్లతో ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణం త్వరలో ప్రారంభమవుతుందన్నారు. డయాలసిస్ రోగులకు శస్త్రచికిత్సల కోసం రూ. 33 కోట్లతో 7 వాస్క్యులర్ సెంటర్లు, కొత్తగా 16 డయాలిసిస్ సెంటర్లకు మంజూరుతో పాటు 89 డయాలసిస్ మిషన్లను అందుబాటులోకి తెచ్చినట్టు వెల్లడించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నష్టాల్లోంచి ఆర్టీసీని లాభాల బాటలోకి రాబోతుందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పెండింగ్ బకాయిల చెల్లింపులు, కారుణ్య నియామకాలు తెలిపారు. డిపోలను ప్రయివేటీకరిస్తున్నారని చేస్తున్న ఆరోపణలు నిజం కాదనీ, 8 డిపోలను ఇ ఛార్జింగ్ కోసం ఎంపిక చేసినట్టు తెలిపారు. కొత్తగా 2 డిపోలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. బస్సుల సంఖ్యను పెంచుతామని హామీ ఇచ్చారు. రోడ్డు భద్రతా అవగాహనా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించినట్టు తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం కోసం వేసిన



కమిటీ సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. కార్మికశాఖకు సంబంధించిన పొన్నం ప్రభాకర్ సమాధానమిస్తూ, కార్మికుల సంక్షేమం కోసం మూడు రకాల సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్మికులకు కనీస వేతనాల కోసం చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ ప్రభుత్వం వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నదని తెలిపారు. గత ప్రభుత్వంలో ఆగిపోయిన రైతుబంధు ఇచ్చినట్టు తెలిపారు. వీటితో పాటు ఉచిత విద్యుత్, సన్నాలకు బోనస్, రైతుబీమా, రైతు రుణమాఫీ అమలు చేస్తున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో నిలిపేసిన కేంద్ర ప్రాయోజిత పథకాలను పునరుద్ధరణకు చర్యలు చేపట్టినట్టు వివరించారు. కనీస మద్ధతు ధరకు చట్టబద్ధత కల్పించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రం నుంచి ఎరువుల సరఫరాకు ఇబ్బంది ఉన్నా.. మిగులు ఉన్న జిల్లాల నుంచి అవసరమైన జిల్లాలకు పంపించి రైతులకు ఇబ్బంది లేకుండా సేవలందించినట్టు తెలిపారు. అన్ని పంటలకు మద్ధతు ధరతో కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు.

# ప్రపంచ సుందరి పోటీలు రద్దు చేయాలి

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో నిర్వహించబోతున్న ప్రపంచ సుందరి పోటీలను రద్దు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణజ్యోతి, మల్లు లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని వీరనారి ఐలమ్మ ట్రస్ట్ భవన్‌లో వారు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ పెట్టుబడిదారుల మార్కెట్ ప్రయోజనాల కోసం మహిళల అందాల పోటీలు నిర్వహించటం సిగ్గుచేటని విమర్శించారు. ఎంతో మంది మహిళలు అన్నం లేక, రక్తహీనతతో బాధపడుతున్నారనే విషయాన్ని ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తుంటే.. ఆ స్థితిని అధిగమించేందుకు తగిన విధాన నిర్ణయాలు తీసుకునే చిత్తశుద్ధి పాలకులకు లేదని చెప్పారు. సరైన ఉపాధి దొరకక, పని ప్రదేశాల్లో వేధింపులు, లైంగిక దాడులు జరుగుతుంటే.. వాటిని అరికట్టలేని స్థితిలో ప్రభుత్వాలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మనువాదం ముసుగులో మహిళలను రెండోతరగతి పౌరులుగానే, వంటింటికే పరిమితం చేయాలనే విధానాలను వేగంగా అమలు




చేస్తున్న మోడీ ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం కూడబలుక్కొని తెలంగాణ వేదికగా ప్రపంచ సుందరి పోటీలను నిర్వహించటం సిగ్గుచేటని విమర్శించారు. మే 7న ప్రారంభించనున్న ఈ పోటీలను అదే నెల 31న గ్రాండ్ ఫినాలేతో ముగించనున్నట్టు తెలిపారు. ఈ పోటీలు పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే జరుగుతున్నాయని తెలిపారు. దేశంలో రాష్ట్రంలో పేదరికం, నిరుద్యోగం, మహిళలపై హింస పెరుగుతున్నది, ఈ క్రమంలో మహిళలకు రక్షణ కల్పించాల్సిన పాలకులు అంతర్జాతీయ వేడుకలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ పోటీలు కాస్మోటిక్స్ వస్తువులను, విలాసవంతమైన సరుకులను అమ్ముకునేందుకు తద్వారా లాభాలు అర్జించేందుకు, స్త్రీల అందచందాలను సరుకుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు అనేక రంగాల్లో ముందుకు పోతూ విజయాలు సాధిస్తుంటే వారి వ్యక్తిత్వం, గౌరవం, ఔన్నత్యాన్ని పెంచే విధంగా విధి విధానాలు రూపొందించాలి గానీ..వారి వ్యక్తిత్వాన్ని కించపరిచే విధంగా సినిమాల్లో అశ్లీలతను విచ్చలవిడిగా పెంచేందుకు అనుమతులు కల్పిస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి కే.ఎన్. ఆశలత, రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యలు రానివ్వం

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో ప్రస్తుతం తాగునీటికి ఎక్కడా సమస్య లేదనీ, కొందరు పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధికారం పోగానే తాగునీరు రావడం లేదనే దుష్ప్రచారం చేస్తున్నదని విమర్శించారు. తెలంగాణలో ఉష్ణోగ్రత్తలు పెరుగుతున్న నేపథ్యంలో రిజర్వాయర్లల్లో తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం హైదరాబాద్‌లోని మిషన్ భగీరథ శాఖ రాష్ట్ర కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మిషన్ భగీరథలో అప్పటి అధికారులు, సిబ్బందే పని చేస్తున్నారని గుర్తు చేశారు. రిజర్వాయర్లల్లో తాగునీటికి తగినంత నీటి నిలువలు ఉన్నాయని చెప్పారు. గతంలో తాగునీరు అందని గ్రామాలకు కూడా ఈసారీ సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఆదిలాబాద్ వంటి జిల్లాలతోపాటు ఏజెన్సీ గ్రామాల్లో బోర్లు వేసి తాగునీటిని అందిస్తున్నట్టు చెప్పారు. తాగునీటి సమస్యలు, నీటి కటకట అంటూ ఈమధ్య వార్తా పత్రికల్లో వచ్చిన కథనాల పట్ల మంత్రి తీవ్ర అగ్రహం వ్యకం చేశారు. అధికారుల నుంచి వివరణ తీసుకున్నారు. మిషన్ భగీరథ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఏదైనా సాంకేతిక కారణాలతో అవాంతరాలు ఏర్పడితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రకటించారు. తాగునీటి అవసరాలకు ప్రతి జిల్లా కలెక్టర్ వద్ద రూ. 2 కోట్లు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. మిషన్ భగీరథ రాష్ట్ర కార్యాలయంలో 24 గంటలపాటు పనిచేసే



కాల్‌సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. వేసవి ముగిసే వరకు నిరంతరాయంగా సమీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మిషన్ భగీరథ ఇంజినీర్ ఇన్ చీఫ్ కృపాకర్‌రెడ్డి, సీఈ చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ మెట్రో వద్ద ఐపీఎల్ టికెట్ల బ్లాక్ దందా

హైదరాబాద్: అమృత్ తెలంగాణ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) లో భాగంగా ఆదివారం ఉప్పల్ స్టేడియంలో సన్ రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య మ్యాచ్ జరగనుంది. ఈ సీజన్ శనివారం ప్రారంభం కాగా ఆదివారం జరిగే రెండో మ్యాచ్ కోసం ఇరు జట్ల అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. స్టేడియంలో ప్రత్యక్షంగా వీక్షించాలని ఆశపడుతున్నారు. ఈ మ్యాచ్ టికెట్లను ఆన్ లైన్, ఆఫ్ లైన్ లో విక్రయించగా నిమిషాల వ్యవధిలో అమ్ముడయ్యాయి. చాలామంది అభిమానులు టికెట్లు దొరకక నిరాశకు గురయ్యారు. ఈ డిమాండ్ ను సొమ్ముచేసుకునేందుకు టికెట్లు దక్కించుకున్న కొంతమంది కేటుగాళ్లు వాటిని బ్లాక్ లో అమ్ముతున్నారు. టికెట్ల



కోసం ఉప్పల్ స్టేడియానికి వచ్చి వెళుతున్న వారికి అధిక ధరలకు అమ్మజూపుతున్నారు. శనివారం ఉప్పల్ మెట్రో వద్ద భరద్వాజ్ అనే యువకుడు బ్లాక్ లో టికెట్లు అమ్ముతున్నాడని సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. భదద్వాజ్ ను అరెస్ట్ చేసి, అతడి వద్ద ఉన్న నాలుగు టికెట్లను స్వాధీనం చేసుకున్నారు. భరద్వాజ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# కాలం నుదిటిపై మెరిసే సింధూరం గొప్ప దేశభక్తుడు మన భగత్ సింగ్....



కాలం నుదుటిపై మెరిసే సింధూరం మన భగత్ సింగ్

(మార్చి 23 భగత్‌సింగ్ 94వ వర్ధంతి) అమృత్ తెలంగాణ "మనకు సోషలిస్టు విప్లవం కావాలి. దానికి ముందు రాజకీయ విప్లవం రావాలి. రాజకీయ విప్లవమంటే ప్రభుత్వం బ్రిటీష్ పాలకుల నుండి భారతీయుల చేతుల్లోకి మారడం మాత్రమే కాదు. విశాల ప్రజా మద్దతుతో విప్లవ పార్టీ చేతుల్లోకి అధికారం రావాలి. ఆ తర్వాత సోషలిస్టు ప్రాతిపదికపై మొత్తం సమాజ పునర్నిర్మాణానికి పూనుకోవాలి" స్వాతంత్ర్యానంతర భారతదేశ నిర్మాణంపట్ల భగత్‌సింగ్ భావనలివి. తనను ఉరితీయడానికి కొద్దిరోజుల ముందు%% 1931 ఫిబ్రవరి 2న జైలు నుండి వెల్లడించిన ఓ వ్యాసంలోని ఈ వ్యాఖ్యలు ఆయన లోతైన ఆలోచనలకు ప్రతీకలు. భగత్‌సింగ్‌ను కేవలం ఓ స్వాతంత్ర్య సమరయోధుడిగా, బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన సాహసిగా మాత్రమే చూస్తే అది అసమగ్రమేనని ఈ వ్యాఖ్యలు తెలియజేస్తున్నాయి. చరిత్రలో ఏ వ్యక్తినైనా పరిశీలించేందుకు, అందునా భగత్‌సింగ్ లాంటి ఆలోచనాపరుడిని, విప్లవకారుడిని అంచనా వేయడానికి లోతైన పరిశీలన అవసరం.

మౌలికంగా ఆ వ్యక్తి ఆలోచనా విధానం, దాని వికాసం తెలుసుకోకుండా పరిశీలిస్తే వాస్తవాలకు దూరంగా ఉండిపోతాం. పాక్షిక సత్యాలకే పరిమితమవుతాం. భగత్‌సింగ్ విషయంలో అదే జరిగింది. అందుకు కారణం వలసపాలకులు సరిగ్గా నమోదు చేయని అధికారిక రికార్డులు కావొచ్చు, ఆయన ఆలోచనల విస్తృతిని నివారించాలన్న స్వాతంత్ర్యానంతర పాలకవర్గాల ఉద్దేశాలు కావొచ్చు, మితవాద శక్తుల కుతంత్రాలు కావొచ్చు. ఇలా కారణాలేమైనప్పటికీ మనం భగత్‌సింగ్‌ను పూర్తిగా తెలుసుకోవడంలో వెనుకబడి పోయాం.

ఫలితంగా ఆయన కేవలం గొప్ప దేశభక్తుడిగా, పోరాట యోధుడిగా, త్యాగధనుడిగానే మనలో చాలామందికి గుర్తుండిపోయాడు. బ్రిటీష్ పాలన నుంచి విముక్తి సాధించడమే ఆయన ఏకైక రాజకీయ లక్ష్యంగా ప్రచారంలో ఉండిపోయింది. కానీ అంతకు మించిన ఆయన సైద్ధాంతిక పునాది గురించి, ప్రాపంచిక దృక్పథం గురించి ఎంతమందికి తెలుసు? అది తెలుసుకోవడం ఇప్పుడు దేశానికి చాలా అవసరం.

నేడు దేశంలో నిజం నిందలు మోస్తున్నది. అబద్ధం అందలమెక్కి ఊరేగుతున్నది. మనుషులు మనుషులుగా కొనసాగే పరిస్థితులు సన్నగిల్లిపోతున్నాయి. మోసం ద్వేషం ప్రజల మెదళ్లలోకి చొప్పించబడుతున్నది. అనేకానేక ఆధిపత్యాల నుంచి, అజ్ఞానపూరిత మూఢనమ్మకాల నుంచి దేశాన్ని కాపాడవలసిన పాలకులు, శాస్త్రీయతను పెంపొందించాల్సిన ప్రభుత్వాలే పౌరులను తిరోగమనంలో ముంచెత్తుతున్న వర్తమానమిది.

ప్రశ్నిస్తే పౌరస్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని నిర్బంధంలోకి నెట్టేస్తున్న కాలమిది. మతాన్ని రాజ్యంతో విడదీయలేనంతగా కలిపేసి, మత ప్రాతిపదికన రాజకీయ సమీకరణలకు పాల్పడుతున్న రోజులివి. విశ్వాసం విద్వేషంగా మారి మన రాజ్యాంగ స్ఫూర్తికే సవాలు విసురుతోంది. మన ప్రజాస్వామ్యం మునుపెన్నడూ లేనంతగా ప్రమాదంలో పడింది. సమాజంలో సామరస్యం బీటలువారుతున్నది. ప్రజాజీవితంలో భయం రాజ్యమేలుతున్నది.

ఒక అభద్రతాభావం వెంటాడుతున్నది. అబద్ధాల పునాదుల మీద మిథ్యా చరిత్రని నిర్మించే మిత– మతవాద రాజకీయాలు సమాజాన్ని తప్పుదారి పట్టిస్తున్నాయి. దీన్ని ప్రశ్నించాల్సిన పౌరసమాజం మౌనంగా వీక్షిస్తున్నది. ఈ మొత్తం సందర్భాన్ని మనం ఎలా చూడాలి? ఎలా ఎదుర్కోవాలి? లౌకిక, ప్రజాస్వా మిక శక్తుల పాత్ర ఎలా వుండాలి? ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానమివ్వగలిగిన మేధోసంపత్తిని మనకు వారసత్వంగా అందించి పోయాడు భగత్‌సింగ్.

అది పూర్తిగా ఆచరణాత్మకమైనదీ, సైద్ధాంతికమైనది. అందువల్ల భగత్‌సింగ్‌ను అధ్యయనం చేయటం నేటి తరానికి అత్యంత అవసరం.

"మతమౌఢ్యం, మతోన్మాదం మన పురోగతికి పెద్ద అడ్డుగోడలు. అవి దారిలో అనేక ఆటం కాలు సృష్టిస్తాయి. మనం వాటిని పక్కకు నెట్టుకుంటూ ముందు కెళ్లాలి. మతాలన్నింటిలో కనిపించే మూఢవిశ్వాసాలు, ఛాందసవాదం, సంకుచిత ధోరణుల వల్లే మనుషులు దోపిడీకి గురవుతున్నారు" అంటాడు భగత్‌సింగ్. మతం దోపిడీదారుల చేతుల్లోని ఒక సాధనమని ఆయన ఆనాడే గ్రహించాడు.

కాబట్టే 1924లో తన పదిహేడేళ్ల వయసులోనే "విశ్వమానవ సౌభ్రాతత్వం" అనే అద్భుతమైన రచన చేశాడాయన. అందులో "ప్రపంచంలోని మానవు లందరూ ఒకటే.. ఎవరూ మరెవరికీ పరాయి కాదు" అంటాడు. "నలుపు–తెలుపు, నాగరికులు–అనాగరికులు, పాలకులు–పాలితులు, ధనిక –పేద, అగ్రవర్ణాలు–అంటరాని వర్గాలు అనేవి ఉనికిలో ఉన్నంత కాలం విశ్వమానవ సౌభ్రాతత్వం ఎలా సాధ్యమవుతుంద"ని ప్రశ్నించాడు.

ఇవి సర్వమానవ సౌభ్రాతృత్వానికి అవరోధాలని చెప్పాడు. ఆ వయసులో ఎవరైనా అంతటి ఆలోచనాపరులై ఉంటారని ఊహించగలమా? కానీ ఆయన అలాంటి ఆలోచనలు కలిగి ఉండటమే కాదు, వాటి ఆచరణకు జీవితాన్నే ధారపోశాడు. మనిషి అసలు గుణం ప్రేమ. సహజీవన సౌందర్యం. అంతే కానీ కులమూ మతమూ కాదు అని చెప్పదలచుకొన్నాడు భగత్‌సింగ్. జనజీవితంలో అత్యంత సహజమైనవిగా ఉన్న లౌకిక విలువల పట్ల అచంచలమైన విశ్వాసాన్ని ప్రకటించాడు.

1926లో "నౌజవాన్ భారత సభ" స్థాపన ద్వారా భగత్‌సింగ్ తన ఆలోచనలకు నిర్మాణ రూపమిచ్చాడు. ప్రజలకోసం ప్రజల చేత విప్లవం సాధించడం సభ లక్ష్యంగా ప్రకటించాడు. ఈ లక్ష్యసాధనలో మతం మన పురోగతికి అతిపెద్ద ఆటంకమని సభ ప్రణాళికలో నిర్దిష్టంగా పేర్కొన్నాడు. విభేదాలు పక్కనపెట్టి ఒక ఉమ్మడి అజెండాతో లౌకిక, ప్రజాస్వామిక ప్రాతిపదిక మీద కలసి పనిచేయడం ద్వారానే మనం పురోగమించగలమని చెప్పాడు.

మతాన్ని రాజకీయాల నుండి విడదీయ గలిగితేనే మనం ప్రజలను ఐక్యంగా ఉంచగలమని స్పష్టం చేశాడు. భారతదేశ అభ్యున్నతిని కోరేవారెవరైనా దీన్నే అనుసరిస్తారని చెప్పాడు. భారత దేశానిది సమ్మిళిత సహజీవన సంస్కృతి అని నినదించాడు. నిజమే కదా..! 'భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు. సుసంపన్నమైన బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం' అని నిత్యం ప్రతిజ్ఞ చేస్తున్నాం మనం. శతాబ్దాలుగా దేశం సంతరించుకున్న ఈ విలువలను కాపాడుకోవడం, సమున్నతంగా నిలబెట్టు కోవడం ఇప్పుడు కాలం మన ముందు నిలిపిన అతిపెద్ద సవాలు. ఈ సవాలును ఎదుర్కోవడానికి మనకిపుడు భగత్‌సింగ్ కావాలి. ఆయన భావజాలం కావాలి.

భగత్‌సింగ్‌ను అర్థం చేసుకోవాలంటే ఆయన రచనలు చదవాలి. ముఖ్యంగా జైలు నోట్‌బుక్ మనకు ప్రధాన వనరు. ఆయన సాధించిన సైద్ధాంతిక పరిణితిని తెలుసుకోవడానికి అది చాలా ఉపయోగపడుతుంది. మిగతా రాజకీయ ఖైదీల్లా ఆయన జైలులో ఉండి ఆత్మకథలు రాసుకోలేదు. ఈ ప్రపంచాన్ని అధ్యయనం చేశాడు. గాయాలపాలైన ఈ నేల విముక్తికి మార్గాలను అన్వేషిం చాడు. మహామహులనేకమంది రచనలను, రాజకీయ సిద్ధాంతాలను లోతుగా పరిశీలించాడు.

ఆ తరువాత మార్క్సిజం వెలుగులో భారతదేశ భవిష్యత్తును దర్శించాడు. నిస్తేజంగా పడివున్న ఈ నేలకు జవసత్వాలు కూడగట్టేందుకు అవసరమైన భావజాలాన్ని అభివృద్ధి చేశాడు. "దోపిడీ పీడనలు, అసమానతలు లేని సమాజ స్థాపన కోసం మన ప్రజలను సిద్ధం చేయాలి. ఈ విప్లవ బీజాలను నాటడానికి ఇప్పుడున్న పంటలన్నిటినీ ధ్వంసం చేయాలి. ముండ్లపొదలను పీకి తగల బెట్టాలి.

బండరాళ్లను కంకరగా పగలగొట్టాలి. కిందపడిన వారిని పైకి లేవనెత్తాలి. అరాచకులకు మర్యాద నేర్పాలి. శ్రామిక ప్రజలను ఒక్కటి చేయాలి. ఇందుకు అడ్డుగా ఉన్న కులమతాల గోడల్ని కూలగొట్టాలి" అని నిర్దేశించాడు. ఈ లక్ష్య సాధనకు ఏంచేయాలో కూడా వివరించాడు. "ప్రజలు తమలో తాము పోట్లాడుకోకుండా వారిలో వర్గ ధృక్పథాన్ని కల్పించాలి. కార్మికులకు, రైతులకు వారి మొదటి శత్రువు పెట్టుబడిదారుడని చెప్పాలి.

వారు సృష్టించే కులమతాల ఉచ్చుల్లో పడవద్దని వివరించాలి. మనుషులు ఏ కులం వారైనా, ఏ మతం వారైనా, ఏ జాతి వారైనా ఒకే విధమైన హక్కులు కలిగి ఉంటారని తెలియజేయాలి. ఆ హక్కులు వారి ఐక్యతలో ఉన్నాయని, వారి సంక్షేమం అధికారాన్ని తమ చేతుల్లోకి లాక్కోవడంలో ఉందని అర్థం చేయించాలి" అన్నాడు.

పెట్టుబడిదారీ ప్రభుత్వాలేవి ప్రజలను చైతన్యవంతులను చేసే కృషిని సమ్మతించవు. పైగా నిర్దయగా అణచివేస్తాయి.

కనుక ఈ స్థితిని రూపుమాపాలంటే విప్లవం ద్వారా మనం అధికారాన్ని చేతుల్లోకి లాక్కోవాలంటాడు భగత్‌సింగ్. విప్లవమంటే రక్తపాతంతో కూడిన ఘర్షణలుకావు. అది బాంబులు, తుపాకుల పూజ కాదు. కొన్ని సందర్భాల్లో అవి కూడా లక్ష్యాన్ని సాధించే సాధనాలు కావొచ్చు. అంతే తప్ప అదే విప్లవమని చెప్పలేం. విప్లవమంటే నిజమైన అర్థం మెరుగైన మార్పు కోసం జరిగే పోరాటం. పాత నుండి కొత్తకు ప్రయాణించడం.

మానవ చైతన్యం తిరోగమన శక్తుల్ని తొక్కుకుంటూ పురోగమించడం అంటూ విప్లవానికి నిర్వచనం చెప్పాడు భగత్‌సింగ్. "ఇప్పుడు ఈ తిరోగమన శక్తుల మూలంగా దేశం దయనీయ స్థితిని ఎదుర్కొంటోంది. ఒక మతస్తుడికి మరో మతస్తుడు శత్రువు అన్నట్టుగా ఉంది పరిస్థితి. ఎదుటి వ్యక్తి ముస్లిం అయితే చాలు.. అతడిని చంపడానికి హిందువులకు వేరే కారణం అక్కర్లేదు. ఎదుటివాడు హిందువైతే చాలు.. అతడిని చంపటానికి ముస్లింలకూ కారణమవసరం లేదు. అలాగే సిక్కులు కూడా.

ఈ స్థితి మనుషులను ముక్కలు చేయడం తప్ప ఒక్కటిగా ముందుకు నడిపించగలదా? దీన్ని అడ్డుకోవడం, అధిగమించడం విప్లవకారుల కర్తవ్యం" అంటాడు భగత్‌సింగ్. నాడు లాహోర్‌లో చెలరేగిన మతకల్లోల నేపథ్యంలో ఆయన రాసిన "మతకల్లోలాలు – వాటి పరిష్కారాలు" అనే వ్యాసంలో ఈ విషయాలన్ని సమగ్రంగా వివరించాడు.

సరిగ్గా వందేళ్ల తర్వాత అవే పరిస్థితులు ఇప్పుడు దేశంలో కొనసాగుతున్నాయి.

పైగా మతతత్వం అధికారంలోకి వచ్చి కూర్చుంది. దేశమంతటా విభజన, విద్వేష రాజకీయాలు మనుషుల్ని చీలికలు పేలికలు చేస్తున్నాయి. శాంతినీ సామరస్యాన్నీ ధ్వంసం చేస్తున్నాయి. మనువాదం మనిషిని తిరిగి మధ్యయుగాలకు మళ్లించజూస్తోంది. దారిలో ముండ్లు కనబడితే ఎత్తిపారేసే మనిషి, రాళ్లూ రప్పలూ ఎదురైతే తొలగించి నడిచే మనిషి ఇప్పుడు అచేతన జీవిలా మారిపోతున్నాడు.

మనిషి మనిషిగా జీవించడానికి కావాల్సిన సహజమైన ఆవరణమే లేకుండాపోతోంది. ఈ ఆవరణాన్ని కమ్ముకుంటున్న చీకటిని ఛేదించే టార్చ్‌బేరర్ భగత్‌సింగ్. అందుకే మనకు భగత్‌సింగ్ కావాలిప్పుడు. ఈ స్థితిని అర్థం చేసుకోవడానికీ అధిగమించడానికీ కావాల్సినంత అవగాహననూ చేతననూ మనకందించి పోయాడు భగత్‌సింగ్. వాటిని అందిపుచ్చుకోవాలి. విద్వేషం వీధివీధినా పారుతున్న వేళ.. ప్రేమను గడపగడపకూ పంచిపెట్టాలి. రక్తసిక్తమైన హృదయాలకు లేపనాలు పూయాలి.. మతమౌఢ్యం మనకు వారసత్వంగా సంక్రమిస్తున్న ఓ పెద్ద అబద్ధమని కుండబద్ధలు కొట్టాలి.

నీతికి మూలం మనిషే కావాలి తప్ప, మతం కాకూడదని నినదించాలి. భగత్‌సింగ్ ఇందుకు అవసరమైన చూపునిస్తాడు, పోరాడే బలమిస్తాడు. విధ్వంసమైన బతుకుల్ని విప్లవ కార్యాచరణకు నడిపించడమెలాగో వివరిస్తాడు. నిత్యం కాలం నుదిటిపై నిగనిగలాడే ఎర్రని సింధూరమతడు.




అమృత్ తెలంగాణ బ్యూరో
సీనియర్ రిపోర్టర్ కేఎల్ రాములు,

# పంట పొలలోకి వెళ్లడానికి గ్రావెల్ రోడ్డు మంజూరు.....

## రెండు లక్షల రూపాయల నిధులను మంజూరు చేయించిన మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి...... గ్రావెల్ రోడ్డు పనులు ప్రారంభం కావడం తో ఎమ్మెల్యేకు అభినందనలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేస్తున్న అర్లి,కే రైతు లు



మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రావెల్ రోడ్డు పనులు ప్రారంభించిన కాంగ్రెస్ కార్యకర్తలు



అర్లికే పంట పొలాల్లోకి వెళ్లే గ్రావెల్ రోడ్డు పనులు ప్రారంభం

నిర్మల్ జిల్ల నర్సాపూర్ జి మార్చ్ 22 అమృత్ తెలంగాన నర్సాపూర్ జి మండలంలోని అర్లీ,కే గ్రామంలో పంట పొలాల్లోకి వెళ్లడానికి రోడ్డు మార్గం సరిగ్గా లేకపోవడంతో రైతుల సమస్యను కాంగ్రెస్ కార్యకర్తలు మాజీ శాసనసభ్యులు జీ విఠల్ రెడ్డి, దృష్టికి తీసుకు వెళ్ళగా పంట పొలాల్లోకి వెళ్లే రోడ్డు వెంటనే పూర్తి చేయాలన్న ఉద్దేశంతో ఈ విషయాన్ని మన నిర్మల్ జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క, దృష్టికి తీసుకువెళ్లి సుమారు రెండు లక్షల రూపాయల గ్రావెల్ రోడ్డును మంజూరు చేయించడం జరిగింది మంజూరు చేయించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,కి మరియు నిర్మల్ జిల్లా ఇన్చార్జి మంత్రి కి మరియు ముధోల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన రైతులు అర్లి,కే గ్రామస్తులు. ఈ కార్యక్రమంలో నిర్మల్ ఏఎంసి డైరెక్టర్ చే0ద్యాలా మురళి,భోజన్న,, ప్రభాకర్, ప్రవీణ్, మగ్గిడి భోజన్న, సాయినాథ్ గంగప్రసాద్, ప్రశాంత్, పాల్గొన్నారు

# హార్టికల్చర్ విద్యార్థులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను విద్యార్థులకు పరిచయం చేసే లక్ష్యంతో ఆదిలాబాద్ లోని బిఎస్సి అగ్రికల్చర్ కళాశాల ఆధ్వర్యంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ కోర్స్ లో భాగంగా పాలీ హౌస్ ఫీల్డ్ విజిట్ కార్యక్రమంను చేపట్టారు. మావల సమీపంలోని శ్రీకాంత్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి పాలీ హౌస్ ని సందర్శించి అగ్రికల్చర్ విద్యార్థులకు పాలీ హౌస్ టెక్నాలజీ యొక్క ప్రాముఖ్యత, దాని నిర్మాణ విధానం, వాతావరణ నియంత్రణ, పంటల సాగు పద్ధతులు మరియు ఈ సాంకేతికత ద్వారా లభించే వాణిజ్య ప్రయోజనాల గురించి సవివరంగా శ్రీకాంత్ రెడ్డి ప్రశాంత్ రెడ్డి విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. ఈ ఫీల్డ్ విజిట్‌లో భాగంగా, విద్యార్థులు నేరుగా పాలీ హౌస్‌లోకి వెళ్లి అక్కడ సాగు చేస్తున్న పంటలను పరిశీలించడం జరిగింది. ఈ టెక్నాలజీ ద్వారా సంప్రదాయ వ్యవసాయం కంటే ఎక్కువ ఉత్పత్తిని ఎలా సాధించవచ్చో, అలాగే వాతావరణ మార్పుల నుండి పంటలను ఎలా రక్షించవచ్చో వివరించారు. కార్యక్రమంలో టీచింగ్ అసోసియేట్స్ డాక్టర్ కె. మౌనిక, డాక్టర్ రాథోడ్ సునీల్ కుమార్, డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, ల్యాబ్ అసిస్టెంట్లు ఎన్. రాజు, ప్రశాంత్ చౌహాన్, సందీప్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించిన సీఎం రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం. ఆడే గజేందర్



నేరగొండ మార్చి 22 అమృత్ తెలంగాణ: అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసినందుకు బీసీ బిడ్డగా ముద్ర పడ్డాడని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆడే గజేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో సీఎం చిత్రపటానికి ఆడ గజేందర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున పాలాభిషేకం చేశారు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుపై రాష్ట్రంలో ప్రజలు ఆశాదనాలు సంబరాలు జరుపుకుంటున్నారని నిరుద్యోగ యువతీ యువకులకు రాజు వికాస్ పథకం ఎంతో ఉపయోగపడుతుందని ఈ పథకంతో నిరుద్యోగులు ఉపాధి పొందుతారని అన్నారు బిసి బిల్లు రాజీవ్ వికాస పథకంతో బీసీలకు బీసీ బాంధవుడు అని అన్నారు ఈ కార్యక్రమంలో ఎలేటి రాజశేఖర్ రెడ్డి, ఆడే వసంతరావు, యువ నాయకుడు బద్దం పోతారెడ్డి, కపిల్, నారాయణ, రాజు గౌడ్, సింగారపు స్వామి, తీగల విలాస్, గంధం నవీన్ ఎండి సద్దాం కాంగ్రెస్ కార్యకర్త నాయకులు ప్రజలు పాల్గొన్నారు

# ఇల్లు అద్దెకిచ్చే ఓనర్లు జాగ్రత్త.

## మట్కా గేమింగ్, పేకాట ఆడితే ఇల్లు జప్తు అవుతుంది.
## అసాంఘిక,చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, నిర్వహిస్తే ఇల్లు, భవనాల జప్తు
## ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్లో నలుగురు మట్కా జూదరుల పై కేసు
## రూ 10200/- నగదు, పెద్ద ఎత్తున మట్కా చీటీలు స్వాధీనం.
## అదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ఇంట్లో మట్కా నిర్వహించిన, జూదం, పేకాట ఆడిన ఇల్లు సీజ్ అవుతుందని ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. ఇల్లు కానీ, షాపు గాని, గోడౌన్ గాని, షెడ్లు గాని కిరాయికి తీసుకొని లేదా సొంతగా ఓనర్లే అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, జూదం పేకాట లాంటివి నిర్వహిస్తే ఇకనుండి సెక్షన్ 152 బి ఎన్ ఎస్ ఎస్ ప్రకారం ఆర్డిఓ కి సిఫార్సు చేసి ఇల్లుని భవనాన్ని సీజ్ చేయడం జరుగుతుందని ఆదిలాబాద్ డిఎస్పి తెలిపారు. వివరాలలో ఈరోజు ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్లో రనదివ్య నగర్ కు సంబంధించిన వ్యక్తి జుంగిరే ప్రవీణ్, లఖన్, పుస్తక్ శివ, చందన్ కేడి ఆకాష్ లపై మట్కా కేసు నమోదు అయిందని వారి వద్ద నుండి రూ 10200/-, పెద్ద ఎత్తున మట్కా చిట్టీలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఓనర్లు ముందు జాగ్రత్తగా కిరాయికి ఇచ్చేముందు కిరాయి దారులు ఏం చేస్తున్నారని విషయాన్ని గమనించాలని తెలిపారు. ఒకవేళ కిరాయి దారులు అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే దానికి తమ ఇల్లును రెవిన్యూ అధికారులు జప్తు అవుతుందని గమనించాలన్నారు. ఓనర్లే నిర్వహిస్తే వారిపై కేసు నమోదు చేస్తూ ఇల్లు జప్తు చేసుకోబడుతుందని తెలిపారు. గతంలో మావాల పోలీస్ స్టేషన్ల పరిధిలో నకిలీ విత్తనాల నిర్వహిస్తున్న ముఠాను పట్టుకున్న సమయంలో నిర్వహిస్తున్న స్థలం షెడ్డును సెక్షన్ 152 బిఎన్ఎస్ఎస్ ప్రకారం జప్తు చేసుకోవడం తెలిపారు. రెండు రోజుల క్రితం కుర్షిత్ నగర్ నందు ఆదిలాబాద్ రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో నమోదైన మటక కేసు నమోదు ఆర్డీవోకు గదిని జప్తు చేయాలనే సిఫార్సు చేయడం జరిగిందని తెలిపారు. కావున ప్రజలందరూ గమనించి జాగ్రత్తగా ఉంటూ అసాంఘిక కార్యకలాపాలకు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఇల్లులు భవనాలు అద్దెకు ఇవ్వకుండా గమనిస్తూ ఉండాలని తెలిపారు.

# ఆదిలాబాద్ ఆర్టీసీ డీఎంగా ప్రతిమా రెడ్డి



ఆదిలాబాద్ :అమృత్ తెలంగాణ: ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ గా జి.ప్రతిమారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఆమె కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ డిపో మేనేజర్ గా పనిచేసిన కల్పన జగిత్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. నూతన డీఎం గా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు ఉద్యోగులు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్టీసిని లాభాల బాటల్లో నడిపించేందుకు ప్రయాణికులతో చేరువై కృషి చేస్తామని నూతన డీఎం పేర్కొన్నారు.



ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించి జ్ఞాపిక, శాలువాల తో సన్మానించిన జిల్లా పాలనాధికారి రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, dfo ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, సబ్ కలెక్టర్ యువరాజ్, జిల్లా అధికారులు, తదితరులు

# దాబాలలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకూడదు.

**మద్యం సేవించి వాహనాలు నడపకూడదు.**
**జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలి.**
**ఇచ్చోడా, నేరడిగొండ, సిరికొండ పోలీస్ స్టేషన్లను సందర్శించిన జిల్లా ఎస్పీ.**
**గంజాయి, మత్తు పదార్థాలను పూర్తిస్థాయిలో అరికట్టాలి.**
**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.**





అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ : జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలను పూర్తిగా అరికట్టాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. ఈరోజు ఇచ్చోడ, నేరడిగుండా, సిరికొండ మండలాల పోలీస్ స్టేషన్లను సందర్శించిన జిల్లా ఎస్పీ, మొదటగా సిబ్బంది ద్వారా గౌరవ వందనాన్ని స్వీకరించి, పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్లో ఉన్న వాహనాల పై కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలాల పరిధిలో జాతీయ రహదారి ఉన్నందున ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపడుతూ ఎక్కువగా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు నిర్వహిస్తూ, రోడ్డు ఇంజనీరింగ్ తప్పిదం ఉన్న ప్రదేశాలలో సైన్ బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, జిగ్జాగ్ పద్ధతిని ఆవలంబిస్తూ ప్రమదాలను అరికట్టాలని తెలిపారు. మండలాల పరిధిలో ఎలాంటి మత్తు పదార్థాలను, గంజాయి పండించడం సేవించడం లాంటివి జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఇచ్చోడ మండల కేంద్రంలో ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపడుతూ అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ముందస్తు మీటింగ్లు నిర్వహిస్తూ పర్యవేక్షిస్తుండాలని తెలిపారు. ముఖ్యంగా రహదారిలో దాబాలలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు మద్యం సేవించడం లాంటి వాటిని ఉపేక్షించకుండా నిరంతరం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ అప్రమత్తమై విధుల నిర్వర్తించాలని సూచించారు. ఆదివాసి ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ గంజాయి వల్ల ప్రభుత్వ పథకాలను నష్టపోతారు అనే విషయాన్ని తెలియజేస్తూ చైతన్య పరచాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో ఉన్న సైబర్ క్రైమ్, చైల్డ్ మ్యారేజ్, యువతకు చదువుతూ ఉన్న లబ్ధిపై అవగాహన కల్పించే చైతన్యపరచాలని సూచించారు. స్టేషన్ల పరిధిలో రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఎఎస్పి కాజల్ సింగ్ ఐపీఎస్, ఇచ్చోడ సిఐ భీమేష్, ఎస్సైలు తిరుపతి, శ్రీకాంత్, శివరాం ప్రసాద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే మంచి భవిష్యత్ జిల్లా పాలనాధికారి రాజర్షి షా





శనివారం అదిలాబాద్ రూరల్ చించు ఘాట్ నిర్మాన్ , సర్వీస్ నౌ సంస్థ దత్తత తీసుకున్న గ్రామాన్ని సందర్శించి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా.





శనివారం అదిలాబాద్ రూరల్ చించు ఘాట్ నిర్మాన్ , సర్వీస్ నౌ సంస్థ దత్తత తీసుకున్న గ్రామం లోలైవ్ వుడ్ కిట్స్ లబ్ధిదారులకు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా.

అమృత్ తెలంగాణ: శనివారం అదిలాబాద్ రూరల్ చించు ఘాట్ నిర్మాన్ , సర్వీస్ నౌ సంస్థ దత్తత తీసుకున్న గ్రామాన్ని సందర్శించి, లైవ్ వుడ్ కిట్స్ లబ్ధిదారులకు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా. శుక్రవారం అదిలాబాద్ రూరల్ చించుఘాట్ గ్రామాన్ని సందర్శించి మాట్లాడుతూ నిర్మాణ్, సర్వీస్ నౌ సంస్థ దత్తత తీసుకొని గ్రామాన్ని ఆదర్శ గ్రామం గా తీర్చిదిద్దుతున్నారని అభినందించారు. గ్రామం లో మౌళిక వసతుల తో పాటు విద్య, వైద్యం, ఆర్థికంగా అభివృద్ధి పథం లో ముందుకు వెళుతున్నదని, ఆ సంస్థ నుండి వచ్చిన 20 మంది గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని ఆన్నారు. ఈ సందర్భంగా 34 కుటుంబాలు ఈ గ్రామం లో ఉన్నాయని, వీటితో పాటు 17 గ్రామాలను దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. ఈ సంస్థ గత 5 సంవత్సరాల నుండి సేవలు అందిస్తున్నారని ఆన్నారు. దిశ మోడల్ స్కూల్ ద్వార నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందిస్తున్నారని , విద్యార్థులు మంచిగా చదువుకొని భావితరాలకు ఆదర్శంగా నిలవాలని, గ్రామాల నుండి ఐఏఎస్, ఐపీఎస్ లు కావాలని కోరారు. అనంతరం ఐరన్ తో చేసిన ఎడ్ల బండ్ల ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్, సంభందిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారిణి అదిలాబాద్ గారి చే జారీ చేయనైనది.

# తహసీల్దార్ నూతన భవనానికి నిధులు మంజూరు..

కుబీర్ : అమృత్ తెలంగాణ: మండల కేంద్రమైన కుబీర్ మేజర్ గ్రామ పంచాయతీ లో గత కొన్ని సంవత్సరాల కాలం నుండి మండల ప్రజలకు సేవాలాందించేందుకు తహసీల్దార్ భవనం లేక అధికారులు, మరియు మండల ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదురుకోవడం చూసి ప్రజలకు ఇబ్బందులు రాకుండా ఉండేందుకు కృషి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ గత కొన్ని రోజుల క్రితం మండల కేంద్రానికి ఓ సమావేశానికి హాజయ్యారు. దింతో అక్కడి ప్రజలు, నాయకులు ఎన్నో ఏండ్ల నుంచి తహసీల్దార్ భవనానికి స్వంత భవనం లేక బి సి వసతి గృహంలో పనులు చేపట్టడం జరుగుతుందన్న విషయం తెలపడం తో ఎమ్మెల్యే మండల ప్రజలు నూతన భవనం మంజూరు చేస్తానని చెప్పడం జరిగింది. దింతో శనివారం తహసీల్దార్ నూతన భవనానికి ఎస్ డి ఎఫ్ కింద 50లక్షల నిధులు మంజూరు కావడం జరిగిందని బీజేపీ మండల అధ్యక్షులు ఏశాల దత్తాత్రి తెలిపారు. దింతో ఆయన మాట్లాడుతూ కుబీర్ మండల కేంద్రంలో నూతన భావన



నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే కు మండల ప్రజలు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంగా శేఖర్, లింబాద్రి కనకయ్య తదితరులు ఉన్నారు.

# ఏప్రిల్ 1నుండి ప్రజలకు సన్నబియ్యాన్ని పంపిణీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు.





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ రేషన్ దుకాణాలలో సన్నబియ్యం సరఫరా అంశంపై రేషన్ డీలర్లు, రెవెన్యూ అధికారులతో ఆయన శనివారం తన ఛాంబర్ లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి అన్ని రేషన్ దుకాణాలలో సన్నబియ్యాన్ని పంపిణీ చేయాలన్నారు. ప్రజలెవరికి ఎట్టి పరిస్థితుల్లోనూ దొడ్డు బియ్యాన్ని ఇవ్వవద్దు అన్నారు. సన్న బియ్యం జారీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా ఉండాలన్నారు. వేసవికాలం ఎండలు అధికంగా ఉన్నందున్న రేషన్ దుకాణాలకు వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాట్లు చేయాలని, ప్రజలుకు ఎండ నుంచి రక్షణ కల్పించేలా తగిన ఏర్పాట్లను చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయిస్ డిఎం వేణుగోపాల్, డిఎస్ఓ కిరణ్ కుమార్, రేషన్ డీలర్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా భూగర్భ జల శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం.



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ శనివారం కడెం మండల కేంద్రంలోని రైతు వేదికలో మార్చి 22 అంతర్జాతీయ జల దినోత్సవం సందర్భంగా మండల రైతులకు, మహిళ సమాఖ్య సభ్యులకు నీటి పొదుపు, నిత్యజీవితంలో నీటి ప్రాముఖ్యత, ఇంకుడు గుంతలు, తదితర అంశాలపై భూగర్భ జల శాఖ అధికారులు అవల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా భూగర్భ జల శాఖ అధికారి పి. శ్రీనివాస బాబు మాట్లాడుతూ, నీరు లేకుంటే మానవ మనుగడ సాధ్యం కాదని, మనుషులకే కాకుండా జీవులన్నింటికీ నీరు చాలా అవసరమని తెలిపారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా నీటిని వృధా చేయకుండా పొదుపు చేయాలన్నారు. ఎన్నో దేశాలు నీరు దొరకక ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని. నీటిని పొదుపు చేయడం ద్వారా భావితరాలకు నీటిని అందించిన వారమవుతామని తెలిపారు. అనంతరం డిఆర్డిఓ విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవడం ద్వారా వర్షపు నీరు, నిత్యవసరాలకు వినియోగించిన నీరు ఇంకుడు గుంతలలో ఇంకి భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఇంకుడు గుంటల నిర్మాణం చేపట్టాలన్నారు. ఆదర్శ రైతులు మల్లేష్, రాజమల్లు, బైరి గంగరాజు, లను అధికారులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ అరుణ, మండల వ్యవసాయ అధికారి దినేష్, ఉద్యానవన అధికారి స్పందన, ఈజీఎస్ హెచ్ఆర్ సుధాకర్ , మిషన్ భగీరథ ఏఈఈ అభిలాష్, నీటిపారుదల ఏఈఈ విశాల్, మండల పంచాయతీ రాజ్ అధికారి కవిరాజ్, రైతులు, మహిళా సమాఖ్య సంఘ సభ్యులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులంతా పాఠశాల స్థాయి నుంచి సామాజిక అంశాలపై అవగాహనను కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్ తెలిపారు.





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ శనివారం కలెక్టరేట్లోని తన చాంబర్లో బాలశక్తి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సందర్శనకు వచ్చిన నిర్మల్ కేజీబీవీ విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలు పెంచేందుకు జిల్లాలో ప్రత్యేకంగా బాలశక్తి కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. విద్యార్థులకు కలెక్టర్ కార్యాలయ పనితీరు, రెవెన్యూ అంశాలు, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులంతా చరిత్ర, రాజ్యాంగం, జనరల్ నాలెడ్జ్ పై పట్టు సాధిస్తే ప్రభుత్వ ఉద్యోగాలను సులభంగా సాధించవచ్చును అన్నారు. పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు సమీకృత జిల్లా కార్యాలయాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సలోమి కరుణ, డాక్టర్ శ్రీనివాస్, కేజీబీవీ విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

# అధిక ఉష్ణోగ్రతల కారణంగా జిల్లాలోని మారుమూల ప్రాంతాల ప్రజల సహాయార్థం ప్రతి సోమవారం టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ వేసవి కాలం అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో 24.03.2025 నుండి ప్రతీ సోమవారం ప్రజలు ప్రజావాణి కార్యక్రమానికి తమ అర్జీలను సమర్పించేందుకు వీలుగా ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు టెలి ఫోన్ ప్రజావాణి నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలు తమ ఇంటి వద్ద నుంచే 91005 77132 ఫోన్ నంబర్ ను సంప్రదించడం ద్వారా నేరుగా తమ సమస్యలను తెలిపి, దరఖాస్తులను వాట్సప్ ద్వారా పంపవచ్చునన్నారు. టెలిఫోన్ ప్రజావాణి ద్వారా స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి, ఆన్ లైన్ లో నమోదు చేసి పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే 11:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు యధావిధిగా సాధారణ ప్రజావాణి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని దూర ప్రాంత ప్రజలు టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



జిల్లా పాలన అధికారి అభిలాష అభినవ్

# గుండె పోటుతో ఆర్ఎంపీ వైద్యులు మృతి ..

కుబీర్ :అమృత్ తెలంగాణ: మండలంలోని పార్డి (బి ) గ్రామానికి చెందిన ఆర్ ఎంపీ వైద్యులు పోతన్న శనివారం ఉదయం గుండె పోటుతో మృతి చెందడం జరిగింది. గ్రామస్తులు కుటుంబ సభ్యులు తెలపిన వివరాల ప్రకారం పోతన్న అనే ఆర్ ఎంపీ వైద్యులు ఉదయం గ్రామంలో ఉన్న ప్రజలకు వైద్య సేవలు అందించి తిరిగి ఇంటికి వచ్చారు ఇంట్లో కుటుంబ సభ్యులు తన కుమారుడి వివాహం కొరకు నూతన వస్త్రాలు కొనుగోళ్లు చేసేందుకు హైదరాబాద్ కు వెళ్లారు. దింతో ఆయన ఒక్కరే ఇంటి వద్ద ఉన్నారు. దింతో ఒక్కసారిగా గుండె పోటు రావడంతో కుప్పకూలిపోయాడు. అదే క్రమంలో పోతన్న తల్లి కుమారుడి కొరకు భోజనము తీసుకువచ్చి చూసే సరికి కుర్చీలో ఉన్న పోతన్న కింద పడిపోవడం తో చుట్టూ ప్రక్కల వారికి తెల్పడం తో వెంటనే బైంసా అస్పత్రి కి తరలించగా అక్కడి వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. పోతన్న మృతి చెందిన సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు కంటి తడి పెట్టారు.

# వేసవి వ్యాధులు – తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వేసవి ఎండలతో అనేక రుగ్మతలు వ్యాపిస్తుండటం సహజం. డీ హైడ్రేషన్ నుంచి ఫుడ్ పాయిజనింగ్ వరకూ కొన్ని వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. చాలా వ్యాధులు వైరస్‌ల వల్ల వస్తాయి. పరిశుభ్రతకు ఎక్కువ శ్రద్ధ వహించాలి. తరచుగా చేతులు, కాళ్లు కడుక్కోవాలి. ప్రయాణం చేసేటప్పుడు హ్యాండ్ శానిటైజర్ ఉపయోగించటం మర్చిపోవద్దు. శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవటం చాలా అవసరం. వేసవిలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యల వివరాలు ఇవిగో

వడదెబ్బ (సన్‌స్ట్రోక్) : ఎండలో ఇష్టానుసారంగా తిరిగినా, నీరు తక్కువగా తీసుకున్నా వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీల కంటే ఎక్కువగా ఉన్నా, అయోమయం, గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది, చెమట పట్టకపోవటం, కాళ్ళూ చేతుల నొప్పులు, శరీరం తిమ్మిరి, వాంతులు, తలనొప్పి, స్పృహకోల్పోవటం వంటివి వడదెబ్బ లక్షణాలు. వడదెబ్బ తగిలిన వ్యక్తి శరీరాన్ని చల్లబర్చాలి. తడిగుడ్డతో శరీరమంతా తుడవాలి. నీళ్లు తాగించి వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లటం ఉత్తమం. ఈ సమస్య రాకుండా ఉండాలంటే తీరు ఎక్కువగా తాగాలి. నిమ్మరసం, కొబ్బరినీరు, గ్లూకోజ్ డి వంటివి తీసుకోవాలి. ఇంట్లో ఎలక్ట్రోరల్ ఫౌడర్ లేదా ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచుకోండి. అవి అందుబాటులో లేకపోతే చక్కెర, ఉప్పు కలిపిన నీరు తాగండి.

విషాహారం (ఫుడ్‌పాయిజనింగ్) : ఆహారం ద్వారా వ్యాపించే వ్యాధులు వేసవిలో సాధారణం. ఇవి ఎక్కువగా హానికారక బ్యాక్టీరియా, పరాన్నజీవుల వల్ల వస్తాయి. అధిక వేడికారణంగా ఆహారం త్వరగా పాడవుతుంది. అలాంటి ఆహారం తీసుకోవటం వల్ల ఫుడ్ పాయిజనింగ్ అయ్యే ప్రమాదం ఉంటుంది. ఆహారం చెడిపోకుండా చూసుకోవాలంటే బాగా ఉడికించాలి. వండిన ఆహారాన్ని బయట వేడిలో ఉంచినప్పుడు బ్యాక్టీరియా పెరుగుతుంది. ఈ సమస్యను అధిగమించేందుకు తాజా ఆహారాన్ని తినటం ముఖ్యం. మసాలాలతో కూడిన ఆహారాన్ని తగ్గించాలి.

కంటి ఇన్ఫెక్షన్ : ఈ కాలంలో కనిపించే కొన్ని సాధారణ కంటి వ్యాధుల్లో కంటి వాపు, అలెర్జీ, కంజక్టివైటిస్ ఉంటాయి. తగినంత విశ్రాంతి కళ్లకు ఇవ్వాలి. వాటిపై ఒత్తిడి తగ్గించాలి. మీ కళ్ళు, ముఖాన్ని క్రమం తప్పకుండా శుభ్రమైన నీటితో కడగాలి. ఎండలో బయటకు వెళ్తే కళ్లజోడు వాడటం మంచిది. సమస్యలు వస్తే డాక్టరు సిఫారసు మేరకు ఐడ్రాప్స్, మందులు వాడాలి.

చర్మ సమస్యలు : సూర్యుడి అతినీలలోహిత కిరణాలు వల్ల చర్మంలోని కణాలు దెబ్బతింటాయి. ఎండలో ఎక్కువగా తిరిగితే చర్మం కమిలిపోతుంది. అధిక తేమ, వేడి కారణంగా చర్మంపై ఎరుపు దద్దుర్లు, స్వేద గ్రంథులు మూసుకుపోవటం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. చెమట వల్ల మచ్చలు, దురద మంట వస్తుంది. చర్మ సమస్యలు రాకుండా ఉండా లంటే వేసవిలో సన్‌స్క్రీన్ లోషన్లు వంటివి కూడా ఉపయోగించొచ్చు. వాడిన దుస్తులను ఉతక్కుండా మళ్లీ వాడకూడదు. చెమట ఎక్కువగా పడుతున్నందున స్నానం రెండుమూడు సార్లు చేయొచ్చు. శరీరానికి గాలి తగిలేలా వదులైన, చెమట పీల్చే కాటన్ దుస్తులు ధరించటం మేలు.

అతిసార : ఎండవేడి కారణంగా ఆహారం త్వరగా పాడైపోతుంది. అలాంటి ఆహారం తీసుకుంటే వేసవిలో విరోచనలు సాధారణం. కలుషిత ఆహారం తినటం, నీరు తాగటం, మద్యపాన అలవాట్లు డయేరియాకు దారితీస్తాయి. అతిసారం నుంచి దూరంగా ఉండటానికి నీటిని మరిగించిన తర్వాత మాత్రమే తాగటం అలవాటుగా చేసుకోవాలి. కూరగాయలను ముక్కలుగా చేయటానికి ముందు, తర్వాత వాటిని బాగా కడగాలి. ఇళ్లల్లో ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా చూసుకోవాలి. పాడైనవి కాకుండా వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవటం మేలు.

చికెన్‌పాక్స్ : చికెన్‌పాక్స్ (అమ్మోరు) చాలా సాధారణ వేసవి వ్యాధుల్లో ఒకటి. ఇది అధిక జ్వరంతో శరీరంపై ఎరుపురంగులో ఉండే చిన్న దద్దుర్లు రూపంలో ప్రారంభమవుతుంది. ఇది పిల్లల్లో తక్కువ రోగ నిరోధకశక్తి ఉన్న వారిలో సాధారణంగా కనిపిస్తుంది. ఇది అంటువ్యాధి. అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఇది సోకినప్పుడు బయటకు తిరగకుండా ఇంట్లో ఉండటమే మేలు. మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. త్వరగా తగ్గే వీలుంది.

తట్టు : మీజిల్స్ మరో సాధారణ వేసవి వ్యాధి. మీజిల్స్‌కు కారణమయ్యే పారామిక్సో వైరస్ వేసవిలో వేగంగా సంతానోత్పత్తి చేస్తుంది. దీని ప్రారంభ లక్షణాలు దగ్గు, అధిక జ్వరం, గొంతునొప్పి, కళ్లు ఎర్రబడటం, తరువాతి దశలో, చిన్న తెల్లటి మచ్చలు ఏర్పడతాయి. మీజిల్స్ దద్దుర్లు శరీరం అంతటా కనిపిస్తాయి. మందులు వాడితే తగ్గిపోతుంది.

కామెర్లు : నీటి ద్వారా సంక్రమించే వ్యాధి. ఇది హైపటైటిస్ ఎ వల్ల వస్తుంది. ప్రధానంగా కలుషిత మైన ఆహారం, నీటి వినియోగం వల్ల వస్తుంది. సకాలంలో చికిత్స చేయకపోతే ఈ వ్యాధి కాలేయం పనితీరును ప్రభావితం చేస్తుంది. ఇది పిత్తం అధిక ఉత్పత్తికి దారితీస్తుంది.

టైఫాయిడ్ : జ్వరం వస్తే సొంత వైద్యంతో నిర్లక్ష్యం చేయొద్దు. జ్వరంతోపాటు తలనొప్పి, నీరసంగా ఎక్కువగా ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. అపరిశుభ్ర ఆహారం, నీరు తీసు కోవటం వల్ల ఈ సమస్య వస్తుంది. కలుషిత ఆహారం, నీటి వనరులు బ్యాక్టీరియాకు సంతానోత్పత్తికి ప్రదేశంగా మారతాయి. టైఫాయిడ్ వస్తే బలహీనత, ఆకలిలేకపోవటం, కడుపులో నొప్పి, అధిక జ్వరం వంటి లక్షణాలు కన్పిస్తాయి.



గవదబిళ్ళలు : వేసవి వ్యాధుల్లో గవదబిళ్లలు అత్యంత అంటువ్యాధి. ఈ వైరల్ వ్యాధి పిల్లలను ప్రభావితం చేస్తుంది. ఈ అంటువ్యాధి సోకిన వ్యక్తి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వ్యాపిస్తుంది. లాలాజల గ్రంథివాపు, కండరాలనొప్పి, జ్వరం, తలనొప్పి, ఆకలి లేకపోవటం, బలహీనత వంటి లక్షణాలు కన్పిస్తాయి.

తలనొప్పి : అధిక ఉష్ణోగ్రతలతో తలనొప్పి ఎక్కువగా కనిపిస్తుంది. వేడి వల్ల వచ్చే తలనొప్పి శరీరం వేడికి ప్రతి స్పందించటం వల్ల కూడా వస్తుంది.

పైన పేర్కొన్న వ్యాధులకు అధునాతనమైన మందులు అందుబాటులో ఉన్నాయి. డాక్టరు సలహా మేరకు వాటిని ఉపయోగిస్తే అవి నియంత్రణలోకి వస్తాయి.

ఈ చిట్కాలు పాటించండి

తరచూ మంచినీరు, నిమ్మకాయ ద్రావణంతోపాటుగా ఎక్కువ మజ్జిగ తీసుకోవాలి

నారింజ, దానిమ్మ వంటి పండ్లను తినాలి

మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకూ బయటకు వెళ్లకండి

క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి

సూర్యకాంతికి గురి కావడాన్ని తగ్గించండి. ఉదయం లేదా సాయంత్రం మాత్రమే వ్యాయామం వంటి కార్యక్రమాలను చేయండి.

కళ్ల సంరక్షణ కోసం కూలింగ్ గ్లాసులు పెట్టుకోవాలి

లేతరంగు, తేలికైన వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి

బ్యాక్టీరియాతో ఉండే స్ట్రీట్‌ఫుడ్ తినొద్దు

ప్యాకింగ్ చేసిన పండ్లు, కూరగాయలు తీసుకోవద్దు

పండ్లు, కూరగాయల వినియోగాన్ని పెంచండి.

ఆల్కాహోల్, కెఫైన్ తీసుకోవద్దు

కూల్‌డ్రింక్స్ తాగొద్దు.

డాక్టర్ జి.అర్చన మాధురి, ఎంబిబిఎస్, ఎండి డివిఎల్, డెర్మటాలజిస్ట్,
కాస్మోటిక్ కేర్ స్పెషలిస్ట్, విజయవాడ

# గ్లిజరీన్ లేకుండానే ఏడ్చాను: చిరంజీవి



రవితేజ మెగాస్టార్ చిరంజీవి కాంబినేషన్ లో మల్టీ స్టారర్ మూవీగా వాల్తేర్ వీరయ్య ప్రేక్షకుల ముందుకి వచ్చింది. భారీ అంచనాల మధ్య రిలీజ్ అయిన ఈ మూవీ సూపర్ సక్సెస్ అందుకుంది. ఇక ఈ సినిమాలో యాక్షన్ ఎపిసోడ్స్ తో పాటు వింటేజ్ చిరంజీవిని చూసే అవకాశం వచ్చిందనే మాట ఆడియన్స్ నుంచి వినిపిస్తుంది. రెగ్యులర్ కమర్షియల్ కథ అయినా కూడా ఎక్కడ బోర్ కొట్టకుండా దర్శకుడు బాబీ అద్భుతమైన కథనంగా ఆవిష్కరించారు. చిరంజీవి రవితేజ ఈ మూవీలో అన్నదమ్ములుగా నటించిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే సెకండాఫ్ ఆరంభంలో రవితేజ క్యారెక్టర్ ఎంటర్ అవుతుంది. క్లైమాక్స్ ముందు చనిపోతుంది. అయితే వీరిద్దరి మధ్య వచ్చే క్లైమాక్స్ ఎపిసోడ్ చాలా ఎమోషనల్ గా సాగుతుంది. రవితేజ చనిపోయే సమయంలో అన్నయ్య వీరయ్యతో జరిగే సంభాషణ ప్రేక్షకులని భాగా కనెక్ట్ అయ్యింది. ఈ సన్నివేశం గురించి తాజాగా జరిగిన సక్సెస్ మీట్ లో చిరంజీవి ఆసక్తికర విషయాలు బయటపెట్టాడు. ఈ సీన్ లో తాను ఎలాంటి గ్లిజరీన్ వాడకుండానే కన్నీళ్లు పెట్టుకున్నా అని చిరంజీవి చెప్పారు. ఆ ఎమోషనల్ సీన్ చేసే సమయంలో నిజానికి రవితేజ కాకుండా ఇంకెవరైనా ఉంటే ఆ స్థాయిలో చేయలేకపోయేవాడినేమో అని రవితేజ చెప్పారు. రవితేజని కేవలం తన తమ్ముడుగా భావించడం వలన ఆ ఎమోషనల్ సీన్ లో గ్లిజరీన్ లేకుండా చేయగలిగానని అలాగే అద్భుతంగా స్క్రీన్ పై ప్రేక్షకులని కంటతడి పెట్టించే విధంగా వచ్చిందని స్టేజ్ పై చిరంజీవి రవితేజని ఉద్దేశించి కామెంట్స్ చేశారు. ఇప్పుడు ఇవి వైరల్ గా మారాయి. అలాగే మా ఇద్దరి కాంబినేషన్ లో వచ్చే అన్ని సీన్స్ కూడా ఫ్యాన్స్ కి పూనకాలు తెప్పించే విధంగా ఉన్నాయని చిరంజీవి అన్నారు.

# గొప్ప మనసు చాటుకున్న నందమూరి బాలకృష్ణ!

మన టాలీవుడ్ హీరోలు వెండితెరపైనే కాదు రియల్ లైఫ్ లోనూ హీరోలే. ఈ విషయాన్ని పలు సందర్భాల్లోనూ నిరూపించారు కూడా. ఇప్పటికీ తమ పేరు బయటకి రాకుండా పబ్లిసిటీకి దూరంగా పలు సేవా కార్యక్రమాలు చేస్తూ తమ సహృదయతను చాటుకుంటున్నారు. మహేష్ బాబు వేయి మందికి పైగా చిన్నారులకు హార్ట్ ఆపరేషన్ చేయించి తన గొప్ప మనసుని చాటుకుంటూ ఇప్పటికీ తన వంతుగా సహాయం చేస్తూనే వున్నారు. మెగాస్టార్ చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ద్వారా సహాయం చేస్తున్నారు. పవన్ కల్యాణ్ తను చేసే సహాయం బయటికి తెలియనివ్వడం లేదు. కానీ తను తోచిన సహాయాన్ని మాత్రం కంటిన్యూ చేస్తూనే వున్నారు. ఇక యంగ్ హీరోల్లో విజయ్ దేవరకొండ కూడా కోవిడ్ నుంచి తనదైన పంథాలో మిడిల్ క్లాస్ కి సహాయం చేస్తూ తన గొప్ప మనసుని చాటుకుంటున్నారు. ఇక అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ కూడా తన వంతుగా ఎంతో మందికి సహాయపడుతున్నారు. తన తల్లి బసవతారకం పేరు మీద నెలకొల్పిన క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా సేవ చేస్తున్నారు. ఎంతో మందికి డబ్బు లేకుండా ఆపరేషన్ లు క్యాన్సర్ చికిత్సలు చేయిస్తున్నారు. డబ్బులు కూడా ఇస్తూ తన గొప్ప మనసును చాటుకుంటున్నారు.



రీసెంట్ గా క్యాన్సర్ కి గురైన ఓ అమ్మాయికి తన సొంత ఖర్చులతో వైద్యం చేయించిన బాలకృష్ణ తను హోస్ట్ గా వ్యవహరిస్తున్న అన్ స్టాపబుల్ విత్ ఎన్ బికె టాక్ షో ప్రభాస్ గోపీచంద్ ల ఎపిసోడ్ కు తనని తన ఫ్యామిలీని ఆహ్వానించి వేదికగా సాక్షిగా మరి కొంత మొత్తాన్ని అందించిన సహృదయతను చాటుకున్నారు. తన చుట్టూ వున్న ఆళ్లపై అభిమానులపై బాలయ్య ఫైర్ అవుతాడనే టాక్ వుంది. అది బాలయ్యలోని ఓ కోణం మాత్రమే. తన సహాయం అర్థించకపోయినా ఆపదలో వున్న వారి గురించి తెలుసుకుని బాలయ్య స్పందిస్తుంటారు. ఆ కుటుంబానికి ఆర్థకంగా అండగా వుంటున్నారు. రీసెంట్ గా మరోసారి బాలకృష్ణ తన గొప్ప మనసుని చాటుకుని అందిరి ఆశ్చర్యపరిచారు. అనంతపురంకు చెందిన ఓ అమ్మాయి ఇంటర్ చదువుతూ బోన్ క్యాన్సర్ తో బాధపడుతోంది. తన ట్రీట్మెంట్ కోసం డాక్టర్లు రూ. 10 లక్షలు ఖర్చవుతుందని చెప్పారట. వారి ఆర్థిక స్తోమత అంతంత మాత్రంగానే వుండటంతో పాపకు చికిత్స చేయించలేకపోతున్నారట. ఈ విషయం తెలుకున్న నందమూరి బాలకృష్ణ వెంటనే వారికి ఫోన్ చేశారట. విషయం తెలుసుకుని పాప ట్రీట్మెంట్ కోసం డాక్టర్లతో మాట్లాడి వెంటనే ట్రీట్మెంట్ ని మొదలు పెట్టించారట బాలయ్య. ఈ విషయం తెలిసి బాలయ్య అభిమానులు జై బాలయ్య అంటూ నెట్టింట ట్రెండ్ చేస్తున్నారు.

# మరో ఫెస్టివల్ కు టార్గెట్ సెట్ చేసిన సూర్య

కోలీవుడ్ లో స్టార్ హీరోగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపుని సొంతం చేసుకున్న నటుడు సూర్య. జైభీమ్ ఆకాశం నీ హద్దురా సినిమాతో సూర్య గత రెండేళ్ళు సూపర్ బ్లాక్ బస్టర్ హిట్స్ ని తన ఖాతాలో వేసుకున్నాడు. అలాగే నేషనల్ అవార్డులని కూడా సొంతం చేసుకున్నాడు. ఈ రెండు సినిమాలు రిలీజ్ అయిన అన్ని భాషలలో సూపర్ హిట్ అయ్యాయి. కోలీవుడ్ రేంజ్ లోనే తెలుగులో కూడా సూర్యకి మంచి ఫ్యాన్ క్రేజ్ ఉంది. ఆయన సినిమాలకి మంచి ఓపెనింగ్స్ కూడా వస్తాయి. సూర్య నుంచి ఒక సినిమా వస్తుంది అంటే కచ్చితంగా అందులో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది అనే అభిప్రాయం ప్రేక్షకులలో ఉంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం సూర్య శివ దర్శకత్వంలో పాన్ ఇండియా ప్రాజెక్ట్ చేస్తున్న సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్ తో పీరియాడికల్ బ్యాక్ డ్రాప్ లో ఈ మూవీ తెరకెక్కుతుంది. ఈ సినిమాలో హీరో సూర్య వారియర్ రోల్ లో కనిపించబోతున్నాడు. దిశా పటాని ఈ సినిమాలో హీరోయిన్ గా కనిపించబోతుంది. భారీ బడ్జెట్ తో పాటు భారీ



తారాగణంతో ఈ మూవీని దర్శకుడు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది. హిస్టోరికల్ నేపథ్యంలో కథని చెప్పబోతున్నాడని తెలుస్తుంది. ఓ విధంగా చెప్పాలంటే సూర్య కెరియర్ లో మొదటి ఇలాంటి హిస్టోరికల్ బ్యాక్ డ్రాప్ లో క్యారెక్టర్ చేస్తున్నాడు.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# కీర్తి సురేష్ రెట్రో లుక్ లో అదరగొట్టేసింది!



క్రేజీ హీరోయిన్ కీర్తి సురేష్ మహానటి తరువాత తన పంథా పూర్తిగా మార్చుకుంది. ఓ పక్క కమర్షియల్ హీరోయిన్ గా సినిమాలు చేస్తూనే మరో పక్క తన టేస్ట్ కి తగ్గ లేడీ ఓరియెంటెడ్ మూవీస్ చేస్తూ రెండు రకాల సినిమాలతో తన కెరీర్ ని బ్యాలెన్స్ చేసుకుంటూ పక్కా ప్లానింగ్ తో వెళుతోంది. ప్రస్తుతం తెలుగులో నేచురల్ స్టార్ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ డ్రామా దసరా లో హీరోయిన్ గా నటిస్తోంది. ఈ మూవీని మార్చి 30న భారీ స్థాయిలో పాన్ ఇండియా మూవీని ఐదు భాషల్లో రిలీజ్ చేయబోతున్నారు. ఇక ఈ మూవీతో పాటు మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న భోళా శంకర్ లోనూ కీర్తి సురేష్ నటిస్తోంది. అయితే ఇందులో తనది హీరోయిన్ క్యారెక్టర్ కాదు. చిరుకు చెల్లెలిగా కనిపించబోతోంది. తమిళ మూవీ వేదాలం ఆధారంగా ఈ మూవీని రీమేక్ చేస్తున్నారు. మెహర్ రమేష్ రూపొందిస్తున్న ఈ సినిమాని ఏకె ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై అనిల్ సుంకర నిర్మిస్తున్నారు. త్వరలో ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇదిలా వుంటే రెండు కమర్షియల్ ఎంటర్ టైనర్ లలో నటిస్తే ఓ హీరోయిన్ ఓరియెంటెడ్ మూవీలో నటిస్తున్న కీర్తి సురేష్ తాజాగా ఓ మహిళా ప్రధాన మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com